అసంపూర్తిగా వదిలేశారిలా..

- పూర్తి చేయని రహదారి విస్తరణ
- అసలే ఇరుకు.. ఆపై గోతులు
- స్తంభిస్తున్న ట్రాఫిక్
- కల్వర్టు శిథిలం
- రాకపోకలకు అవస్థలు



వర్షాలకు స్టేట్ బ్యాంక్ వద్ద రోడ్డు దుస్థితి



వర్షాలకు ముందు స్టేట్ బ్యాంక్ సమీపంలో అధ్వానంగా రోడ్డు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు విస్తరణ చేయకపోవడంతో నిలిచిన ట్రాఫిక్



రెడ్డిపల్లి సినిమా థియేటర్ వద్ద సరి చేయాల్సిన రోడ్డు వంపు

పద్మనాభం: పద్మనాభం–రెడ్డిపల్లి రోడ్డు విస్తరణను అసంపూర్తిగా వదిలేశారు. మూడు కిలో మీటర్ల నిడివి గల రోడ్డులో రెండు కిలో మీటర్లు మాత్రం విస్తరించి, మిగతా రోడ్డును వదిలేశారు. ఇటు రోడ్డూ విస్తరించక.. గోతులూ పూడ్చక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభం

12 అడుగులు రోడ్డును 24 అడుగులకు విస్తరించేందుకు.. సిమెంటు డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులు రూ.14.04కోట్లతో పనులు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రోడ్డును అభివృద్ధి చేస్తామని ముందు ప్రకటించినా.. అధికారంలోకి వచ్చాక రోడ్డు పనులు చేపట్టలేదు.

మహిళలు నడిరోడ్డుపై బైఠాయించడంతో..

రోడ్డు విస్తరణ కోసం రెడ్డిపల్లి మహిళలు గతేడాది డిసెంబర్‌లో రామాలయం వద్ద నడిరోడ్డుపై బైఠాయించి, ధర్నా చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఏప్రిల్‌లో రెండు కిలోమీటర్ల నిడివిలో రోడ్డును విస్తరించారు.. కానీ, ఇక్కడ డ్రైనేజీలు నిర్మిచలేదు. మిగతా కిలోమీటరు నిడివి గల రోడ్డును విస్తరించకుండా వదిలేశారు. మూడు నెలలు అవుతున్నా ఈ కిలోమీటరు రోడ్డును విస్తరించలేదు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రెడ్డిపల్లి స్టేట్ బ్యాంక్ వరకు, కృష్ణమ్మ కల్వర్టు వద్ద, సినిమా హాలు వద్ద రోడ్డు విస్తరించకుండా వదిలేశారు. ఈ రోడ్డు మొత్తం గోతులమయంగా ఉంది. ఈ రోడ్డుపై విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు నిత్యం తిరుగుతూ ఉంటాయి. వర్షం కురిస్తే గోతులు నీటితో నిండిపోయి మార్గం కనిపించక గోతుల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు.



శేరిఖండంలో విస్తరణకు నోచుకోని రోడ్డు

సాధారణ రోజుల్లో కూడా ఈ గోతులు ప్రయాణికుల పాలిట ప్రాణసంకటంగా పరిణమిస్తున్నాయి.

శిథిలావస్థలో కల్వర్టు

రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. ఒక పక్క రక్షణ గోడ శిథిలమైంది. డ్రైవరు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనాలు గెడ్డలో పడి, వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రెడ్డిపల్లి సినిమా హాలు వద్ద మలుపు చాలా ప్రమాదకరంగా మారింది. మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనచోదకులు గోతుల్లో పడుతున్నారు. ఈ మలుపు వద్ద రోడ్డును సరిచేసి, కల్వర్టు నిర్మించాల్సి ఉంది. పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు విస్తరణ పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే..



నేను పద్మనాభం నుంచి విజయనగరం వరకు ఆటో నడుపుతాను. మార్గ మధ్యలో రోడ్డు బాగా లేదు. రోడ్డు విస్తరణ పూర్తి చేయకపోవడంతో బస్సులు, లారీల వంటి వాహనాలు ఎదురెదురుగా వచ్చేటప్పుడు శేరిఖండంలో తప్పుకోలేక ట్రాఫిక్ నిలిచిపోతోంది. గోతుల దారిలో ఆటోలు నడపాలంటే ఇబ్బందిగా ఉంటోంది.

– బి.రమణ, ఆటో డ్రైవర్ ఇసకలపాలెం

ఇరుకు రోడ్డులో అవస్థలు పడుతున్నాం



నేను రెడ్డిపల్లి నుంచి రోజూ పద్మనాభంలో ఉన్న మా ద్విచక్ర వాహనాల స్పేర్ పార్టులు అమ్మే షాపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తాను. రెడ్డిపల్లి స్టేట్ బ్యాంక్ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సినిమా హాలు, శేరిఖండంలో కృష్ణమ్మ కల్వర్టు వద్ద రోడ్డు ఇరుకుగా ఉంది. పైగా రోడ్డు గోతులు పడడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం.

– ఎస్.సూర్యనారాయణ, రెడ్డిపల్లి

చర్యలు తీసుకుంటాం

మిగతా రోడ్డు విస్తరణ పనులు, సైడు కాలువల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పనులు చేయాలని ఇప్పటికే కాంట్రాక్టర్‌కు సూచించాం. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– గంగరాజు, ఆర్‌అండ్‌బీ డీఈ

క్లుప్తంగా

65 మందికి వైద్య పరీక్షలు



వేములవలసలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస శ్రీకృష్ణాలయం వద్ద బుధవారం నిర్వహించిన కంటి, చర్మ సంబంధిత ఉచిత వైద్య శిబిరంలో 65 మందికి సేవలు అందించారు. వీరిలో కంటి చికిత్సకు 55 మంది, చర్మ వ్యాధులకు సంబంధించి 10 మంది హాజరయ్యారు. వీరికి నిర్వాహకులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 15 మందికి శస్త్రచికిత్సలు అవసరం కాగా, వారిని మిథిలాపురి వుడా కాలనీలోని నియో విజన్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామినాయుడు, కోరాడ అచ్యుత సాధు రాంబాబు, గ్రామీణ వైద్యుడు కె.నారాయణరావు, వైద్యులు బాలకృష్ణ, జ్ఞానేశ్వరి, సుహాసిని, లావణ్య, క్యాంప్ మేనేజర్ పవన్ కుమార్, సారిక తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు స్పీచ్‌థెరపీ



స్పీచ్ థెరపీపై అవగాహన కల్పిస్తున్న స్పీచ్‌థెరపిస్ట్ బాల ఈశ్వరి

భీమునిపట్నం: భీమిలిలోని భవిత కేంద్రంలో దివ్యాంగ బాలలకు భాష ఉచ్చారణకు సంబంధించి శనివారం స్పీచ్ థెరపీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్పీచ్ థెరపిస్ట్ బాల ఈశ్వరి మాట్లాడుతూ ఇక్కడ 25మంది పిల్లలు ఉన్నారని, వారికి మాటలు స్పష్టంగా వచ్చేలా శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. దాంతో పాటు ఇక్కడ బాలలకు చదువు, ఆటల ద్వారా వారిలో మంచి మార్పులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో–2 డొకర శ్రీనివాసరావు, భవిత కేంద్ర నిర్వాహకురాలు కేజియా కుమారి, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర విద్యాపీఠ్‌లో కొత్త పీజీ కోర్సులు

మధురవాడ: నగరంపాలెం రోడ్డులోని మధురవాడ వెంకటేశ్వర విద్యాపీఠ్‌లో ఆంధ్రా యూనివర్సిటీ అనుబంధంగా కొత్త పీజీ కోర్సుల నిర్వహణకు అనుమతి వచ్చిందని విద్యాసంస్థల చైర్మన్ యేటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మధురవాడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ రెగ్యులర్ పద్ధతిలో బీఎడ్, డీఎడ్ కోర్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు దూరవిద్య ద్వారా యూజీ, పీజీ కోర్సులు, మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం ఇతర పీజీ కోర్సుల నిర్వహణకు అనుమతి వచ్చిందని తెలిపారు. మరిన్ని వివరాలకు 73860 00590 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు ప్రిన్సిపాల్ కేవీఎస్ శ్రీనివాసరావు, తిరుపతిరావు, ఇన్‌చార్జ్ ఎ.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న 8 మంది అరెస్ట్

తగరపువలస: ఆనందపురం మండలం చీమలమెట్టపాలెం శివారులో కోడిపందాలు ఆడుతున్న 8 మందిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 కోళ్లు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు

పద్మనాభం: స్మార్ట్ మీటర్లను బిగించొద్దంటూ పద్మనాభం గ్రామంలో సీపీఎం కార్యకర్తలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకోవాలని, ఇంటింటికీ ప్రచారం చేస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. సీపీఎం భీమిలి జోన్ సహాయ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. సీపీఎం నాయకులు కె.సీతాదేవి, ఎం.అప్పారావు, ఎస్.రాము, ఎం.రమణ పాల్గొన్నారు.

రైతులకు రుణాల పంపిణీ

తగరపువలస: ఆనందపురం పీఏసీఎస్‌కు నూతన చైర్మన్‌గా పాండ్రంగి అప్పలరాజు, డైరెక్టర్‌గా మీసాల రామునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రైతులకు రూ.30 లక్షల రుణాలు పంపిణీ చేశారు.

కొండవాలు ప్రాంతాన్ని పరిశీలించిన జెడ్సీ

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి ఎస్సీ కాలనీలో కొండచరియలు జారిపడిన ప్రాంతాన్ని జెడ్సీ కనకమహాలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఇక్కడ కొండవాలు ప్రాంతాన్ని రాత్రి సమయాల్లో కొందరు తవ్వేస్తుండడంతో కొండచరియలు జారిపడుతున్నాయి. దీనిపై ఆదివారం సాక్షి దినపత్రికలో 'జారి పడుతున్న కొండ చరియలు' శీర్షికతో ప్రచురితమైన వార్తపై స్పందించిన జెడ్సీ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కొండ తవ్విన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఆదేశిస్తామని ఆమె తెలిపారు.



కొండ తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

రోడ్డుపై రాడ్లు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో రోడ్డును ఆనుకుని వేసిన ఇనుప రాడ్లను అధికారులు సిబ్బందితో తొలగింపజేశారు. ఎండాడ–రుషికొండ ప్రధాన రహదారిని ఆనుకుని ఓ వ్యక్తి ఇనుపరాడ్లు వేసి స్థలం ఆక్రమించడంతో, ఆ మార్గంలో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'ఇనుపరాడ్లు వేసి రోడ్డు ఆక్రమణ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఏసీపీ తిరుపతిరావు స్పందించారు. ఆయన ఆదేశాలతో ప్లానింగ్ సెక్రటరీ బుధవారం ఇనుప రాడ్లను సిబ్బందితో తొలగించారు. రుషికొండ ప్రాంతం వరకు ఎక్కడా ఆక్రమణలు జరగకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



రోడ్డుపై ఇనుపరాడ్లు తొలగించిన ప్రాంతం

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

మధురవాడ: అపరిచితులు, అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని భీమిలి 1వ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ మేజిస్ట్రేట్ పి.స్వాతి భవాని సూచించారు. బాలికలు మరింత జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినాన్ని పురస్కరించుకుని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన చట్టాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, విద్యార్థుల హక్కులు, బాధ్యతల గురించి వివరించారు.



మాట్లాడుతున్న జడ్జి స్వాతి భవాని

సీసీఏపీ చైర్మన్ చంద్రంపాలెం హైస్కూల్ సందర్శన

మధురవాడ: క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీసీఏపీ) ఎన్‌జీవో ప్రతినిధులు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్ శిక్షణను శనివారం పరిశీలించారు. ఇక్కడ విద్యార్థులకు అందుతున్న శిక్షణ, పిల్లలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వీరిలో సీసీఏపీ చైర్మన్ డాక్టర్ రేణుకారాణి, ఇన్‌చార్జి జయ, రిసోర్స్ పర్సన్ కె. సౌమ్య తదితరులు ఉన్నారు. విద్యార్థులు తయారు చేసిన ఆర్టిఫీషియల్ బొకేలతో ఉపాధ్యాయులు వారిని స్వాగతించారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ టీచర్ వి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన బొకేతో స్వాగతిస్తున్న ఉపాధ్యాయులు

లండ పార్థివ దేహానికి నివాళులు

సింహాచలం: రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతిచెందిన అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పూజారి లండ వెంకటరమణ పార్థివ దేహానికి బుధవారం వైఎస్సార్‌సీపి భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. లండ వెంకటరమణ పార్థివ దేహాన్ని వారి ఆచారం ప్రకారం ఖననం చేశారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, నాయకులు కర్రి సత్తిబాబు, బొట్టా శ్రీను తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



లండ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను

జనవరిలో సాధు పరిషత్ మహాసభలు

పద్మనాభం: మద్దిలో వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించనున్న అఖిలాంధ్ర సాధు పరిషత్ మహా సభలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పరిషత్ అధ్యక్షుడు పరమాత్మానంద గిరి స్వామి అన్నారు. మండలంలోని మద్దిగ్రామంలో రామ కోటి ఆశ్రమం వద్ద బుధవారం మహా సభలపై నిర్వహించిన ముందస్తు సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దిలోని పైడితల్లమ్మ ఆలయ సన్నిధిలో మూడు రోజుల పాటు ఈ మహా సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు వందల మంది సాధువులు ఈ సభలకు విచ్చేస్తారన్నారు. మద్ది తన స్వగ్రామం కావడంతో ఈ మహా సభలు ఇక్కడ నిర్వహించడానికి తలపెట్టానన్నారు. అందరూ సహకరించాలని కోరగా, నాయకులు సుముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేష్ కుమార్, కాళ్ల సత్యనారాయణ, సామవేదం బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరమాత్మానంద గిరి స్వామి

కూటమి హామీలపై నాయకులను నిలదీయండి

- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు
- టి.నగరపాలెంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'



ఇంటింటికీ క్యూ ఆర్ కోడ్‌తో కూడిన కరపత్రాలు అందిస్తున్న మజ్జి శ్రీనివాసరావు



టి.నగరపాలెం సభలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ హయాంలో అమల్లో ఉన్న సంక్షేమ పథకాలకు తోడు సూపర్ సిక్స్ పేరుతో పథకాలు అందిస్తామని రాష్ట్ర ప్రజలను మోసం చేసిన నాయకులను ఆ పథకాలు ఎక్కడ? అని నిలదీయాలని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు సూచించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం టి.నగరపాలెంలో బుధవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు లెక్కకు మించి సంక్షేమ పథకాలు అందించాం కాబట్టే 2024లో ఓటమి చెందినా, ప్రజల వద్దకు తలెత్తుకు వస్తున్నామన్నారు.

నాయకులకు బుద్ధి చెప్పాలి

కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయకుండానే అన్ని పథకాలు ఇచ్చేశామంటున్న నాయకులకు బుద్ధి చెప్పాలని చిన్న శ్రీను అన్నారు. ఎన్నికల ముందు సభలో మహిళలకు ఉచితబస్సు పేరుతో చంద్రబాబు దారుణమైన అబద్ధాలకు పాల్పడ్డారన్నారు. టిక్కెట్టు తీయకుండానే చంద్రన్న వద్దన్నాడని, రాష్ట్రంలో ఏ మూలకైనా బస్సుల్లో వెళ్లాలని చెప్పి.. ఇప్పుడు జిల్లా దాటకుండా తిరగాలని మాట మార్చారన్నారు. 14 నెలలు గడిచినా ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం అందరికీ రూ.15వేలు వంతున ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పాక్షికంగా ఇవ్వడమే కాకుండా 30 లక్షల మందికి పూర్తిగా ఎగ్గొట్టారన్నారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు వేళాకోళపు మాటలు ఆడుతున్నారన్నారు. నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీల గురించి కూటమి నాయకులను అడగాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా, విత్తనాల కొరతతో రైతులు అల్లాడిపోతుంటే యథావిధిగా చంద్రబాబు పాలనలో కరువు తాండవించి, వర్షాలు ముఖం చాటేశాయన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పుష్కలంగా వర్షాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించారన్నారు. రాష్ట్రాన్ని ఈ పరిస్థితులలో వదిలేసి చంద్రబాబు సింగపూర్ పర్యటన పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్ ఎంపీటీసీ పల్లా సన్యాసిరావు, రాజగిరి కృష్ణారావు, పల్ల అప్పారావు, రాజగిరి రామచంద్రరావు, తమ్మిన నరేంద్ర, వాండ్రాసి సతీష్‌కుమార్, బాయిన మంగరాజు, పొట్నూరు అచ్యుతరావు, కుప్ప నాగరాజు, తమ్మిన గోపి, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, శిరుగుడి ఈశ్వరరావు, కొయ్య రమేష్‌రెడ్డి, చెల్లూరు నగేష్, తోట ఎల్లారావు, తుపాకుల అప్పలరాజు, మజ్జి సూరినాయుడు, సమ్మిడి శ్రీనివాసరావు, చిల్ల దేవిచిట్టి, బొడ్డు దుర్గారావు, మల్లేటి హరి, గంధవరపు ఉష తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సభలకు కుట్రతో విద్యుత్ కట్

తగరపువలస: 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' పేరుతో వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న సభలు విజయవంతమై, కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాలకు జనాదరణ లేకపోవడంతో వారికి కంటగింపుగా మారింది. బుధవారం సాయంత్రం టి.నగరపాలెం గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతుండగా 7.15 సమయంలో తాటితూరు లైన్‌మన్ ఫణీంద్ర, దాకమర్రి లైన్‌మన్ సాయి రామాలయం వెనుక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి చూడగా లైన్‌మెన్ ఇద్దరూ పొంతనలేని సమాధానాలు చెబుతూ ఉడాయించారు. వాళ్లు చెప్పిన దానిని బట్టి స్థానికంగా జనసేన నాయకునిగా చెబుతున్న వ్యక్తే సభ జరుగుతున్నప్పుడు విద్యుత్ కట్ చేయించారని అర్థమవుతోంది. ఈ నెల 26న మజ్జివలసలో సభ జరుగుతున్న సమయంలోనూ కూటమి నాయకులు ఇదే విధంగా స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయించారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

25 మద్యం సీసాల స్వాధీనం

తగరపువలస: ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సారిక అప్పలరాజు(31)అనే వ్యక్తి నుంచి పోలీసులు 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని బుధవారం అరెస్ట్ చేశారు. వ్యవసాయ పనులు చేసుకునే నిందితుడు వివిధ మద్యం దుకాణాల వద్ద మద్యం కొనుగోలు చేసి, విక్రయిస్తుంటాడని పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ కేసులో ఒకరికి జైలుశిక్ష

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పల్లిపేట గ్రామానికి చెందిన పల్లి రామకృష్ణ పల్సర్ ద్విచక్రవాహనం చోరీ కేసులో విజయనగరం జిల్లా డెంకాడ మండలం గొందయ్యపాలెం గ్రామానికి చెందిన ఎర్నింటి కృష్ణబాబు అలియాస్ గంగడుకు 14 నెలల సాధారణ జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించారు. బుధవారం ఈ తీర్పును భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి.స్వాతి భవాని వెలువరించారు. జరిమానా కట్టకపోతే అదనంగా మరో 15 రోజులు జైలు శిక్ష అనుభవించాలన్నారు. 13.09.2024న సబ్‌స్టేషన్ నుంచి నిందితుడు ఈ ద్విచక్రవాహనాన్ని కాజేశాడు. ఆనందపురం ఎస్‌ఐ ఎ.సత్యారావు కేసు నమోదు చేయగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవతారం ఈ కేసును వాదించి నిందితుడికి శిక్ష పడేలా చేశారు.

ఇద్దరు పర్యాటకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో స్నానం చేస్తుండగా కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ రక్షించారు. బెంగళూరుకు చెందిన ఆరుగురు పర్యాటకులు బుధవారం బీచ్‌కు వచ్చారు. కాసేపు సరదాగా గడిపి, స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో వీరిలో మంజునాథ్, పాపైగౌడ అనే ఇద్దరు కొట్టుకుని పోతుండగా గమనించిన లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, ఎం. అమ్మోరు, చందు, సతీష్ అప్రమత్తమై రక్షించారు. అనంతరం వారికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. పర్యాటకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాస్‌రావు అభినందించారు.



పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ సింహాచలం నాయుడు బుధవారం తెలిపారు. భీమిలి టౌన్ ప్రాంతంతో పాటు బ్యాంక్‌కాలనీ, తాతాజీ నగర్, ఎల్లంపేట, మహాలక్ష్మిపురం, డెక్కతిపాలెం, రాజలింగంపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మూలకుద్దు తదిర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

కొమ్మాది సబ్‌స్టేషన్ పరిధిలో..

మధురవాడ: కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ సేవానగర్ ఫీడర్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారాణంగా సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాంకాలనీ, జీసీసీ లే అవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతి కాలనీ, సేవానగర్, సాయిరాంకాలనీ డ్రైవర్స్ కాలనీ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

గిడిజాల సబ్‌స్టేషన్ పరిధిలో..

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా నీళ్లకుండీలు జంక్షన్, మిందివానిపాలెం, గుమ్మడివానిపాలెం, శొంఠ్యాం ప్రాంత గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.